క్లుప్తంగా

రేపటి నుంచి ఏకాదశి మహోత్సవాలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ రంగ నాయకుల గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీరంగనాథ స్వామి దేవస్థానంలో రేపు(గురువారం) నుంచి జూలై 3వ తేదీ వరకు తొలి ఏకాదశి మహోత్సాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు బూరుగడ్డ శ్రీధరాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకాదశి రోజు అభిషేకం, మహా సుదర్శన యాగం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.

సెల్‌ఫోన్ అందజేత

తిరుమలాయపాలెం: మండలంలోని దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన యాకూబ్‌పాషా అనే వ్యక్తి ఖమ్మం రూరల్ మండలంలోని చింతపల్లి వద్ద మోటార్ సైకిల్‌పై వెళ్తున్న క్రమంలో తన సెల్‌ఫోల్ పోగొట్టుకున్నాడు. కాగా, ఆ ఫోన్ దొరికన తిరుమలాయపాలెంకు చెందిన నాగరాజు ఆ ఫోన్‌తో పాటు ఫోన్ కవర్‌లో ఉన్న లైసెన్స్, పాన్ కార్డు, ఏటీఎం కార్డులను స్థానిక ఎస్సై వరాల శ్రీనివాస్‌కు అందించాడు. దీంతో ఎస్సై బాధితుడికి అప్పగించి నాగరాజును అభినందించారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: జమాతె ఇస్లామిహింద్ ఖమ్మం వన్‌టౌన్ ఉపాధ్యక్షుడిగా ఇంతియాజ్, టూటౌన్ ఉపాధ్యక్షుడిగా యూసుఫ్‌షరీఫ్, త్రీటౌన్ ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ సుబూర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం ఖమ్మం అజీజ్‌గల్లీలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. వీరితో పాటు వన్‌టౌన్ దావా సెక్రటరీగా రజాక్, ఖిద్మతే ఖలక్ సెక్రటరీగా నిహాల్ అహ్మద్ తదితరులు ఎన్నికయ్యారు. వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ అధ్యక్షులు అబ్దుల్ మల్లిక్, అబ్రార్‌అలీ, రఫీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు జాఫర్‌మతిన్, అబ్దుల్ రాఫె, మహిముద్ షరీఫ్, కుదరతుల్లా, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

హస్త కళలను ఆదరిద్దాం



చేనేత చీరను పరిశీలిస్తున్న మేయర్

ఖమ్మంగాంధీచౌక్: చేనేత, హస్త కళలను అందరూ ఆదరించి ప్రోత్సహించాలని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. నగరంలోని బైపాస్ రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో స్వదేశీ హ్యాండీ క్రాఫ్ట్ సొసైటీ ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళల ప్రదర్శనను సోమవారం రాత్రి ఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఈ ప్రదర్శనలో పోచంపల్లి, నారాయణపేట, గద్వాల్, వెంకటగిరి, మంగళగిరి కాటన్ ప్రింటెండ్, చేనేత దుప్పట్లు, హస్తకళల వస్తువులు, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు లభిస్తాయని నిర్వాహకులు చిరంజీవి, రాంబాబులు మేయర్‌కు వివరించారు.

క్రమశిక్షణకు నిదర్శనం ప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: క్రమశిక్షణాయుత పని విధానంతో ప్రసాద్ సీపీఎం ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన నగరంలోని సుందరయ్య భవనంలో సోమవారం రాత్రి ఏర్పాటుచేసిన ప్రసాద్ రావు వీడ్కోలు సమావేశంలో పోతినేని మాట్లాడారు. పార్టీ కార్యాలయ అకౌంటెంట్‌గా ఆయన 15 ఏళ్ల పాటు సమర్థంగా పనిచేశారని తెలిపారు. అనంతరం ప్రసాద్‌రావు, రమాదేవి దంపతులను సన్మానించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, యర్రా శ్రీకాంత్, వై.విక్రం, బీవీకే బాధ్యులు వై.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, నాగమల్లేశ్వరరావు, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఇంటి ఎదుట ఆందోళన

కామేపల్లి (కారేపల్లి): ఇటీవల పిచ్చికుక్క కరవడంతో మండలంలోని పండితాపురం గ్రామానికి చెందిన చిన్నారి చైత్రకు గాయాలైన సంఘటన తెలిసిందే. కాగా, మంగళవారం చైత్రను కరిచిన ఆ పిచ్చికుక్కను చంపి స్థానిక సర్పంచ్ దుర్గాజ్యోతి ఇంటి ఎదుటకు తీసుకొచ్చి స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో పిచ్చికుక్కల బెడదతో ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదని, తక్షణమే కుక్కల బెడద నుంచి రక్షించాలని వారు కోరారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఆదిపురుష్
వినోద	అశ్విన్స్
సాయిరాం	భీమదేవరపల్లి బ్రాంచి, కర్ణ
ఆదిత్య	మను చరిత్ర
శ్రీనివాస	1920

– ఖమ్మం గాంధీచౌక్

అర్జీలపై ఆరా!



నేలకొండపల్లిలోని రామచంద్రాపురంలో పరిశీలిస్తున్న ఎంపీడీఓ జమలారెడ్డి

రూ.లక్ష కోసం 5,753 వేల మంది ఎదురుచూపులు

- నేటితో ముగియనున్న దరఖాస్తుల పరిశీలన
- లబ్ధిదారుల్లో మొదలైన టెన్షన్..
- పక్షపాతంగా విచారించాలని పలువురి వేడుకోలు
- ప్రభుత్వ నిబంధనలే గీటురాయిగా అధికారుల క్షేత్రస్థాయి సర్వే..

బీసీ కుల వృత్తిదారులకు తెలంగాణ ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు చేతి వృత్తిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. దీంతో పెద్దమొత్తంలో బాధితులు దరఖాస్తులు చేసుకున్నారు. పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో మొత్తం 138 గ్రామ పంచాయతీల నుంచి ప్రభుత్వ నిబంధనల మేరకు 5,753 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఈ నెల 6 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ కొనసాగగా.. ప్రస్తుతం ఆ అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో ఇంటింటి పరిశీలన చేస్తున్నారు.

నేలకొండపల్లి: బీసీలోని వివిధ కుల వృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తులు భారీగా వచ్చాయి. కాగా, నేలకొండపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ నేలకొండపల్లి మండల కేంద్రంలో 287 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆచార్లగూడెం పంచాయతీలో అతి తక్కువగా ముగ్గురు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు.

కొనసాగుతున్న పరిశీలన..

ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను మండలస్థాయిలో మండల పరిషత్ అధికారులు పరిశీలన చేస్తున్నారు. ఈ నెల 28వ తేదీలోపు లబ్ధిదారుల జాబితా పరిశీలన పూర్తి చేసి బీసీ సంక్షేమశాఖాధికారికి ఆన్‌లైన్‌లో పంపనున్నారు. అక్కడి నుంచి కలెక్టర్‌కు పంపగా ఆయన ఆమోదంతో ప్రభుత్వం మంజూరు చేసే నిధులను బట్టి వచ్చే నెల 15న రూ.లక్ష ఆర్థిక సాయం అందించే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

పాలేరు నియోజకవర్గంలో అందిన అర్జీలు..

మండలం	జీపీలు	దరఖాస్తులు
నేలకొండపల్లి	32	1,405
తిరుమలాయపాలెం	40	1,257
ఖమ్మంరూరల్	25	1,756
కూసుమంచి	41	1,335
మొత్తం	138	5,753

రూ.లక్ష కోసం సవాలక్ష పాట్లు..

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు పంచాయతీ అధికారులు వచ్చి పరిశీలన చేస్తున్నారు. రూ. లక్ష కోసం అధికారులు సవాలక్ష ప్రశ్నలతో వెరిఫై చేస్తుండడంతో తమకు రాదేమోనని లబ్ధిదారుల్లో టెన్షన్ మొదలైంది. ఇదిలా ఉండగా.. ఈ ఎంపికలో రాజకీయ జోక్యం ఉంటుందేమోనని భావించిన కొందరు లబ్ధిదారులు స్థానిక నేతల ఇళ్ల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో దాదాపుగా అధికారుల వెరిఫికేషన్ పూర్తి కావొచ్చింది. అర్హులైన జాబితాలో తమ పేరు ఉంటుందో లేదోనని బాధితులు ఆందోళన చెందుతున్నారు. మొత్తం మీద పాలేరులో జాబితా బయటకు వచ్చే వరకు ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందేనని పలువురు చర్చించుకుంటున్నారు.

దరఖాస్తుదారులందరికీ ఇవ్వాలి..



దరఖాస్తు చేసుకున్న బీసీ చేతి వృత్తిదారులందరికీ రూ.లక్ష ఆర్థిక సాయం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారులు పక్షపాతంగా విచారణ నిర్వహించి జాబితాను తయారు చేయాలి. అందరిని అర్హులుగా ప్రకటించి ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి.
– పాగర్తి సుధాకర్, బీసీ సంఘం నేత, నేలకొండపల్లి

గడువు పెంచాలి..



రూ.లక్ష ఆర్థిక సాయాన్ని బీసీలోని మిగతా కులాలకు కూడా అవకాశం కల్పించాలి. ప్రభుత్వం పెట్టిన గడువులోగా చాలా మంది దరఖాస్తులు చేసుకోలేదు. ప్రభుత్వం మరోమారు దరఖాస్తు చేసుకునేలా గడువు పెంచి వెసులుబాటు కల్పించి, ప్రభుత్వం బీసీలకు న్యాయం చేయాలి.
– ఉసిరికాయల లక్ష్మయ్య, ఎంపీటీసీ, పైనంపల్లి

నిబంధనల మేరకే పరిశీలన.



ప్రభుత్వ నిబంధనల మేరకు మండలాల్లో దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నాం. నేలకొండపల్లి మండలంలో వచ్చిన 1,405 దరఖాస్తులను డోర్ టూ డోర్ వెరిఫై చేస్తున్నాం. ఎలాంటి వివక్షత ఉండకుండా.. ప్రభుత్వ నిబంధనలే గీటురాయిగా పనిచేస్తున్నాం.
– కె.జమలారెడ్డి, ఎంపీడీఓ, నేలకొండపల్లి

బ్యాంకర్ల నుంచి రైతాంగాన్ని కాపాడాలి

మండల పరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధుల వేడుకోలు



సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజా ప్రతినిధులు

తిరుమలాయపాలెం: రైతుబంధు, ధాన్యం డబ్బులు, పెన్షన్లు తీసుకోవాలంటే రైతాంగం తీసుకున్న రుణాలకు లింకుపెట్టి బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారని, రైతుల ఖాతాలలో డబ్బులు చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజా ప్రతినిధులు మండల సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం ఎంపీపీ బోడ మంగీలాల్ అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సమావేశంలో వారు మాట్లాడారు. పంటల సాగుకు అప్పులు దొరక్క బ్యాంకుల్లో రుణాలు తీసుకుంటే ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు తెలిపారు. దీంతో బ్యాంకు అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో ఇబ్బందులు తొలగిస్తామని ఎంపీపీతో పాటు ఎంపీడీఓ జయరాం, ఏఓ సీతారాంరెడ్డి హామీ ఇచ్చారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న పౌష్టికాహారంపై దృష్టిసారించాలని సమావేశం దృష్టికి తెచ్చారు. విత్తనాల కొరత లేకుండా చూడాలని, నకిలీ విత్తనాలతో పాటు అధిక ధరలను అరికట్టాలని తెట్టెలపాడు ఎంపీటీసీ నాగేశ్వరరావు సమావేశం దృష్టికి తెచ్చారు. దీంతో హైబ్రిడ్ పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, యూ ట్యూబ్‌లో చేస్తున్న ప్రచారంతో మిర్చి విత్తనాలు, పత్తి విత్తనాలు కొనుగోలు చేసి రైతులు మోసపోవద్దని ఏఓ సీతారాంరెడ్డి తెలిపారు. గృహలక్ష్మి పథకంపై విధి విధానాలు ప్రకటించాలని సమావేశం దృష్టికి తెచ్చారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నయాబజార్ పాఠశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు



ఖమ్మంరూరల్: ప్రశంసాపత్రాలు అందిస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంరూరల్: మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై ఆర్‌బీఐ ఆధ్వర్యాన క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలోని నయాబజార్ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలకు నగరంలోని ఎన్నెస్పీ కాలనీ పాఠశాల విద్యార్థులు ఈశ్వర్‌తేజ, వర్షత్‌లు ప్రథమ స్థానంలో నిలిచాలని మంగళవారం పాఠశాల హెచ్‌ఎం మల్లెల శంకర్‌రావు వారికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అలాగే రూరల్‌మండలంలోని వెంకటగిరి ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ స్థానంలో సీహెచ్.శైలజ, టి.ఉషా ప్రతిభ నిలువగా.. జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఇద్దరికి కలిపి రూ.5వేల నగదు అందించారు. ద్వితీయ బహుమతిని తల్లంపాడు, తృతీయ బహుమతిని ఏదులాపురంకు చెందిన విద్యార్థులు పొందారు. ఈ కార్యక్రమంలో పరీక్ష నోడల్ అధికారి చిట్టిబాబు, ఎంఈఓ శ్యాంసన్, ప్రధానోపాధ్యాయులు పి.భీమరాజు, అజిత తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంతోనే ప్రజాసమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న బండి రమేష్

కూసుమంచి: సీపీఎం పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండి రమేష్ అన్నారు. మంగళవారం కూసుమంచిలోని ఎస్‌వీఎస్ కళాశాలలో నిర్వహించే రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనేపథ్యాన పార్టీ సీనియర్ నాయకుడు శీలం గురుమూర్తి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ శిక్షణ శిబిరంలో అకడమిక్ సెల్ జిల్లా నాయకుడు రఫీ అంతర్జాతీయ పరిస్థితులపై శిక్షణ తరగతులు బోధించగా.. రాష్ట్ర నాయకులు సోమయ్య పలు అంశాలపై శిక్షణ అందించారు. పార్టీ మండల కార్యదర్శి ఎడవెల్లి రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు బుగ్గవీటి సరళ, షేక్ బషీరుద్దీన్, తుశాకుల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..

ఆర్టీఓకు..



ఆర్టీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంక్రైం: ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న ప్రైవేట్ స్కూల్ బస్‌లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యాన మంగళవారం జిల్లా రవాణాశాఖాధికారి తోట కిషన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నా.. కొంతమంది స్కూల్ యాజమన్యాలు ఫిట్‌నెస్ లేని బస్సులను తిప్పుతూ విద్యార్థుల జీవితాలతో ఆడుకోంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయడంతో పాటు ఆయా స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, సహాయ కార్యదర్శి సతీష్, కోశాధికారి లక్ష్మణ్, నాయకులు కరుణ్, మురళి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏఓకు..

ఖమ్మంవైద్యవిభాగం: వాతావరణ మార్పుల వల్ల అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ ప్రతినిధి బృందం మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఏఓ మొలియ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం మాట్లాడుతూ.. వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని మండల్లాలో ప్రభుత్వ అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని, అన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు, మందులు ఉండేలా చూడాలని, గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రతినిధి బృందంలో నగర సహాయ కార్యదర్శి యానాల సాంబశివారెడ్డి, త్రీటౌన్ ఏరియా కార్యదర్శి నూనె శశిధర్, ఇన్సాఫ్, ఎస్.కే. సైదా, భూక్యా రవీందర్, దుర్గానాథ్ తదితరులు ఉన్నారు.

పోటీకి అవకాశం ఇవ్వండి..

నేలకొండపల్లి: వచ్చే ఎన్నికల్లో పాలేరు టీడీపీ తరఫున పోటీకి అవకాశం కల్పించాలని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూక హన్మంతరావు కోరారు. ఈమేరకు హైదరాబాద్ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం హన్మంతరావు మాట్లాడుతూ 1982 నుంచి టీడీపీలో కొనసాగుతున్న తాను పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు జి.శ్రీనివాసరావు, నాగుల్‌మీరా, వి.శ్రీనివాసరావు, వీరబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

కామేపల్లి (కారేపల్లి): కామేపల్లి మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోరం కనకయ్య బాటలో నడుస్తామని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ఆధ్వర్యాన భారీ ఎత్తున వందలాది కుటుంబాలు మంగళవారం రాజీనామా చేశాయి. మండల పరిధిలోని రుక్కితండా గ్రామపంచాయతీ పరిధిలో గల బండిపాడు గ్రామం నుంచి 20 కుటుంబాలు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశాయి.ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు బానోత్ నరసింహానాయక్, శీలం పుల్లయ్య, బండి ఉపేందర్, బండి ఎల్లయ్య, లక్ష్మీనర్సు, పాటిబండ్ల ప్రసాద్, బి.నాగేంద్రబాబు, మాజీ ఉప సర్పంచ్ జాటోత్ రామా, గుగులోత్ లాల్‌సింగ్, సక్రు, లచ్చిరాం, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షాన బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెం గ్రామ సర్పంచ్ బొల్లికొండ శ్రీనివాసరావుతో పాటు మరికొందరు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సమక్షంలో వీరు పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై తామంతా పార్టీలో చేరామని సర్పంచ్ తెలిపారు. సర్పంచ్‌తో పాటు కుక్క శ్రీను, బడేటి సురేష్, పాసిని సురేష్, కుక్క రాజేష్, బొల్లికొండ రాములు, ఊడుగు పాపారావు తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఎంపీటీసీ ఊడుగు జ్యోతి, జీళ్లచెరువు సర్పంచ్ కొండా సత్యం, నాయకులు మల్లీడు వెంకటేశ్వర్లు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లిలో మారాల ఆలయం నుంచి ముదిగొండ వెళ్లే లింక్ రోడ్డు పనులకు గ్రామ సర్పంచ్ ఎస్.కోటయ్య మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి రూ. 3 కోట్లు మంజూరయ్యాయని, కాంట్రాక్టర్ నాణ్యతతో నిర్మించాలని తెలిపారు. సీపీఎం నాయకులు తమ్మినేని వెంకట్రావు, బోడపట్ల వెంకన్న, శ్రీను, నరేష్, బాబి, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్లను కొనసాగించాలి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకురాళ్లు

ఖమ్మంరూరల్: గురుకుల బాలికల పాఠశాలల్లో గతంలో అందించిన కేసీఆర్ కిట్‌ను తిరిగి కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు పర్వీన్ తెలిపారు. మంగళవారం మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో గల గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో ఆమె మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నాక మాట్లాడారు. బాత్‌రూలు సరిగా లేవని, నీటి సమస్య ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు ఇచ్చి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, శానిటరీ, నాప్‌కిన్స్ కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకురాళ్లు రాగిణి, సుమలత, నవ్య, సరళ, షరీఫా తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నేలకొండపల్లి: వచ్చే నెల 2న ఖమ్మంలో జరగనున్న కాంగ్రెస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్క శేఖర్ గౌడ్ కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సీఎల్‌పీ నేత భట్టి చేపట్టిన పాదయాత్ర ఈనెల 29న జిల్లాలోకి ప్రవేశిస్తున్నందున ఘన స్వాగతం పలకాలని సూచించారు. నాయకులు రేగూరి వాసవి, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, సూరేపల్లి రవి, యాతాకుల శ్రీనాథ్, పగిడిమర్రి అజయ్, సుదర్శన్, మార్తి కోటి, దోసపాటి శేఖర్, యడవల్లి నాగరాజు, పెద్దపాక ముత్తయ్య, రాంబాబు, చల్లగుండ్ల భద్రయ్య, వంగూరి బాలాజీ, సంతోష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి..

ఖమ్మంరూరల్: పాలేరులో కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి చరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జలగంనగర్, చింతపల్లి, కొండాపురం, చినతండా, నాయుడుపేటల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలు కుటుంబాలు, నాయకులను కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి చేరుకుంటున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోడా వెంకన్న, ఎరబోలు శ్రీను, గుండా మల్లయ్య, లక్ష్మీనారాయణ, బానోత్ దివ్య, ముత్యం చిన్నకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కష్టాలు తెలిసిన ఎంపీ నామా

ఖమ్మంమయూరిసెంటర్: కార్మికుల కష్టసుఖాలు తెలిసిన నేత ఎంపీ నామానాగేశ్వరరావు అని రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు అన్నారు. ఖమ్మం టేకులపల్లిలోని కేసీఆర్ టవర్స్ ఆటో అడ్డాలో మంగళవారం నామా ముత్తయ్య ట్రస్ట్ ఆధ్వర్యాన 212 మంది డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు అందజేశారు. అనంతరం నల్లమల మాట్లాడుతూ.. ఎంపీ నామా ఎప్పుడూ కార్మిక పక్షంగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలకల వెంకటనర్సయ్య యాదవ్, చిత్తారు సింహాద్రి యాదవ్, వాకదాని కోటేశ్వరరావు, షేక్ రహీం, పాల్వంచ రాజేష్, చీకటి రాంబాబు, కృష్ణ ప్రసాద్, భార్గవ్, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాదిల నాగరాజు, కె.రామారావుతో పాటు యాసిన్, వారా నాగరాజు, పిల్లి రామకృష్ణ, పాదిల గోపి, వీరారెడ్డి, షఫీ, దుంగ్రోత్ గోపీ, కె.వినయ్, గుంటి శ్రీను, వై.బీ.నాయుడు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: నగరంలోని రామన్నపేటకు చెందిన షేక్ ఇబ్రహీం అనే వ్యక్తి అదృశ్యం అయినట్లు భార్య ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం ఖమ్మంఅర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఇబ్రహీం ఈనెల 20న రాత్రి ఇంట్లో నిద్రించిన ఇబ్రహీం తెల్లవారేసరికి కలినిపించలేదు. దీంతో ఆయన కుటుంబసభ్యులు పలు చోట్ల ఆరా ఆరా తీసినా ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో మంగళవారం ఫిర్యాదు చేశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



గణేష్‌కు ఆర్థిక సాయమందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం పలువురికి ఆర్థిక సాయమందించారు. ఇటీవల హైబీపీతో బ్లడ్ క్లాట్ అయి చికిత్స పొంది ఇంటికి వచ్చిన అసోసియేషన్ సభ్యులైన భూక్యా గణేష్‌కు రూ.10వేలు, మంచుకొండ గ్రామానికి చెందిన బానోత్ ఉపేందర్ ప్రమాదానికి గురికావడంతో రూ. 7,216లను అందించారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు భుక్యా బాలాజీ, నాయకులు అనిల్‌కుమార్, రామకృష్ణ, సచ్చు వీరబాబు, భద్రాచారి, ఆడెపు హన్మంతరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన..

రఘునాథపాలెం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని సుకిని తండా, వాంకుడోత్ తండా, రజబ్ అలీ నగర్‌ల్లో మృతి చెందిన ముగ్గురి కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసిన నాయకులు పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అజ్మీరా వీరూనాయక్, సర్పంచ్ కాంతితో పాటు నాయకులు రవికిరణ్, భూక్యా లక్ష్మణ్‌నాయక్, అఫ్జల్, రాజానాయక్, దేశానాయక్, శంకర్, ప్రసాద్, తారాదేవి, బాబు, కోట్యా, హేమ, పంతులు, శివలాల్, నాన్యా, శ్రీను, తారాచంద్, రాజా, చందు, బాల్యానాయక్ పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: ఆషాఢ మాసం సందర్భంగా నగరంలోని కాల్వొడ్డు మున్నేరు వంతెన వద్ద ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి అమ్మవారి కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి ఉప్పిసాయి ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మాటేటి అరుణ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, బీఆర్‌ఎస్ యువజన విభాగం ప్రతినిధి చింతనిప్పు కృష్ణచైతన్య, టౌన్ కార్యదర్శి మాటేటి కిరణ్‌ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కిరణ్, రవి, యాదగిరి, సైదులు, చౌదరి, శివ, సాయి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.